ప్రపంచ శాంతి కోసం పాటుపడాలి

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు
- కన్హాలో అంతర్జాతీయ యూత్ సెమినార్ ముగింపు కార్యక్రమం
- పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కన్హా శాంతివనం ఆవరణలో మొక్క నాటిన మంత్రి జూపల్లి, చిత్రంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కన్హా ప్రతినిధులు

నందిగామ, సెప్టెంబర్ 22 : ప్రపంచ శాంతి కోసం ప్రతిఒక్కరూ పాటుపడాల్సిన అవసరముందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలో అంతర్జాతీయ యూత్ సెమినార్ ముగింపు కార్యక్రమంలో ఆదివారం ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి సమస్యను శాంతి మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని, ప్రస్తుతం ప్రపంచానికి శాంతి మార్గం ఎంతో అవసరమన్నారు. శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ద్వారా ధ్యాన గురువు కమలేశ్ పటేల్ ప్రపంచ శాంతి కోసం కృషి చేస్తున్నారని, మిషన్ సేవలను అభినందించారు. కన్హా శాంతి వనంలో ఏర్పాటు చేసిన మొక్కలతో ఆహ్లాదకరమైన వాతావరణం ఎంతో ప్రశాంతతను ఇచ్చిందని, పర్యావరణ పరిరక్షణకు కన్హా శాంతివనం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దేశ విదేశాల నుంచి ప్రతినిధులు, యువత రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ధ్యాన కేంద్రంలో ధ్యాన గురువు కమలేశ్ పటేల్‌తో కలిసి 15 నిమిషాలు ధ్యానం చేసి, కన్హా ఆవరణలో మొక్కలు నాటారు. గత మూడు రోజులుగా నిర్వహించిన యూత్ సెమినార్‌తో యువతలో సరికొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో సమ్మిట్ కన్వీనర్ నివేదిత శ్రేయాన్స్, సినీనటి కృతిశెట్టి, రామచంద్ర మిషన్ ప్రతినిధులు, పది వేల మందికి పైగా యువత, విద్యార్థులు పాల్గొన్నారు.


తమ డాక్యుమెంట్లను ప్రదర్శిస్తున్న ప్లాట్లు, ఇండ్ల యజమానులు

హద్దులు నిర్ణయించండి

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 22 : ఉప్పల్ మండలంలోని ఫతుల్లాగూడ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తట్టిఅన్నారం 125/అ, 125/ఉ పరిధిలోని భూములు రావని పలువురు ప్లాట్లు, ఇండ్ల యజమానులు చెబుతున్నారు. తమ స్థలాల్లో ఎలాంటి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ఉండదని స్పష్టం చేస్తున్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఫతుల్లాగూడ వద్ద సర్వే నం.36లో 10.15 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉన్నదని.. కానీ, ఇప్పుడు 21 ఎకరాలకు పైగా ఉన్నదని కిందిస్థాయి ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారని, డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. చెరువు పెరగడం ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. ఆ చెరువుకు తట్టిఅన్నారం రెవెన్యూలోని తమ సర్వే నంబర్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఎఫ్‌టీఎల్ లేదని అబ్దుల్లాపూర్‌మెట్ ఇరిగేషన్ అధికారులు చెబుతుండగా.. చెరువు ఎఫ్‌టీఎల్‌లోనే నిర్మాణాలు ఉన్నాయంటూ ఉప్పల్ ఇరిగేషన్ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి అవసరమైతే మరోసారి సర్వే నిర్వహించి చెరువు హద్దులు నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బాధితులు శ్రీనివాస్, శ్రీధర్, రవీందర్, ప్రభాకర్, విజయ్‌కుమార్, లక్ష్మణ్, ఆదిత్య, వర్మాలాల్ చౌదరి, జగదీశ్‌చౌదర్, చమన్‌లాల్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారికి షోకాజ్ నోటీసు

వికారాబాద్, సెప్టెంబర్ 22 : విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన పశువైద్యాధికారి పూర్ణచందర్‌రావుకు వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ శనివారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ నెల 20న వికారాబాద్‌లోని ఆలంపల్లికి చెందిన తలారి రవి ఉదయం 10 గంటలకు గర్భంతో ఉన్న బర్రెను చికిత్స నిమిత్తం వికారాబాద్ పశువైద్యాశాలకు తీసుకొచ్చాడు. విధులు నిర్వహించే పశువైద్యాధికారి పూర్ణచందర్‌రావు విధులకు హాజరు కాకపోవడంతో వైద్యం అందక ఆ బర్రె మృతి చెందింది. ఈ విషయమై తలారి రవి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. బర్రె విలువ రూ.లక్ష దాకా ఉంటుందని బాధితుడు వాపోయాడు. స్పందించిన కలెక్టర్ పశువైద్యాధికారికి షోకాజ్ నోటీసు జారీ చేసి మరో మూడు రోజుల్లో ఇందుకు సంబంధించిన వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

ఆమనగల్లులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కేఎల్ ఐ భూనిర్వాసితులకు రూ.17.60 కోట్లు మంజూరు

ఆమనగల్లు, సెప్టెంబర్ 22 : ఆమనగల్లు, మాడ్గుల, వెల్దండ, మండలాల్లోని కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఢీ-82 కాల్వ నిర్మాణం భూనిర్వాసితులకు రూ.17.60 కోట్ల నిధులు మంజూరైనట్లు పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నిధుల మంజూరుపై హర్షం వ్యక్తం చేస్తూ ఆమనగల్లులో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి గత ఐదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న రైతుల భూపరిహారం నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. భూపరిహారం డబ్బులు రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు మానయ్య, జగన్, నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ ఉద్యమ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

తెలంగాణ రాష్ట్ర కళాకారుల నిరుద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘు


కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న రాష్ట్ర కళాకారుల నిరుద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రఘు

వికారాబాద్, సెప్టెంబర్ 22 : నిజమైన ఉద్యమ కళాకారులను గుర్తించకుండా వారికి ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తున్నదని తెలంగాణ రాష్ట్ర కళాకారుల నిరుద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘు మండిపడ్డారు. ఆదివారం జానపద కళాకారుల వికారాబాద్ జిల్లా సంఘం ఆధ్వర్యంలో స్థానిక వికారాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో కళాకారుల నిరుద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ ఉద్యమ కళాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వారికి న్యాయం చేయాలని తెలిపారు. అదేవిధంగా గత కొన్ని రోజులుగా తమ వంతుగా ఖమ్మంలో జరిగిన వరద బీభత్సాన్ని దృష్టిలో పెట్టుకొని వరద బాధితులకు నిధులు సేకరించి సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఇవ్వడానికి ఏర్పాట్లు చేసుకోవడం జరిగిందన్నారు. తెలంగాణ ఆవిర్భావం కోసం ఉద్యమాన్ని ఊర్రూతలూగించడంలో కళాకారుల పాత్ర కీలకమని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా కళాకారులు పాల్గొన్నారు.

అలరించిన 'శ్రీ కల్యాణం' నృత్య రూపకాలు

కొండాపూర్, సెప్టెంబర్ 22 : మాదాపూర్ శిల్పారామంలో ఆదివారం మహతి కళా సమితి గురువులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆయన శిష్య బృందం 'శ్రీ కల్యాణం' నిత్య రూపకాన్ని ప్రదర్శించారు. ప్రదర్శనల్లో వకుళ మాత, ఎరుకుల సాని, ఆకాశరాజు, పద్మావతి శ్రీనివాసుల కల్యాణం ఘట్టాలను ఆకట్టుకునే రీతిలో కళాకారులు సౌమ్య, నారాయణ మూర్తి, అక్షిత, పవిత్ర, శ్రావణి, సహస్ర, మనస్విని, దుర్గాభవానీ, మహతి, నేత్రలు ప్రదర్శించారు. ప్రదర్శనలకు నాట్య గురువులు రత్నశ్రీ, రుద్రవరం సుధాకర్, వాణి రమణ, ఉషారాణిలు ముఖ్య అతిథులుగా హాజరై కళాకారులను అభినందించారు.

విశ్వకర్మలు అన్నిరంగాల్లో రాణించాలి

కందుకూరు, సెప్టెంబర్ 22 : విశ్వకర్మలు అన్ని రంగాల్లో రాణించాలని మండల పరిషత్ వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి తెలిపారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని నేదునూరులో విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పించారు. సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ.. విశ్వకర్మలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదుగాలని, అన్ని విధాలుగా ఆదుకోవడానికి కృషి చేస్తామని తెలిపారు.

చెరువుల్లో చెత్తవేస్తే చర్యలు

బడంగ్‌పేట : ఇదేం పద్ధతి.. చెత్త తీసుకొచ్చి చెరువులో వేయడం ఏమిటని వాహనదారుడిని మాజీమంత్రి, ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి మందలించారు. మురుగు నీరు చెరువులోకి పోకుండా ప్రత్యేక ట్రంక్‌లైన్లు ఏర్పాటు చేశామన్నారు. కోట్లు వెచ్చించి చెరువు సుందరీకరణ పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. చెరువుల్లో ఎవరు చెత్త వేసిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశాలు జారిచేశారు. ఆదివారం సాయంత్రం మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద చెరువు కట్టను పరిశీలిస్తున్న క్రమంలో ఎమ్మెల్యే చూస్తుండగానే చెరువులో చెత్త వేస్తున్న అతనిని పిలిపించి మందలించారు.

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ అడవిరెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన విశ్వకర్మ మహాయజ్ఞంలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి – బడంగ్‌పేట్

ప్రపంచ అగ్రశ్రేణి శాస్త్రవేత్తల్లో బిట్స్ పిలానీ ఆచార్యుడు సాహూ

జవహర్‌నగర్, సెప్టెంబర్ 22: ప్రపంచ స్థాయి అగ్రశ్రేణి శాస్త్రవేత్తల్లో బిట్స్ పిలానీ క్యాంపస్‌కు చెందిన గణితశాస్త్ర ఆచార్యుడు పీకే సాహూకు ప్రత్యేక గుర్తింపు లభించింది. సంబల్‌పూర్ విశ్వవిద్యాలయం నుంచి గణితశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టాను పొందారు. ఈ సందర్భంగా సాహూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024 సంవత్సరానికి గానూ ప్రపంచంలోని టాప్-2 సైంటిస్టుల్లో తాను ఉండటం ఆనందంగా ఉన్నదన్నారు. వరుసగా గత ఐదేండ్లుగా ఈ గౌరవం దక్కడం అభినందనీయమన్నారు. సహకరించిన బిట్స్ పిలానీ యాజమాన్యం, తోటి అధ్యాపకులు, పీహెచ్‌డీ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ సీఎం కేసీఆర్ సూచన మేరకు..

రోడ్డుకు ఇరువైపులా కళకళలాడుతున్న పూల మొక్కలు

కందుకూరు, సెప్టెంబర్ 22 : మాజీ సీఎం కేసీఆర్ పచ్చదానికి ప్రాధాన్యతను ఇవ్వాలని, ఎక్కువగా పూల మొక్కలను నాటాలని సూచించడంతో ఆయన సూచన మేరకు నాటిన పూలమొక్కలు నేడు అనేక గ్రామాల్లో సత్ఫలితాలు ఇస్తున్నాయి. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు పచ్చదనాన్ని ఇస్తున్నాయి. నేదునూరు, రోడ్డు వెంట వెళ్లే వాహనాదారులతో పాటు చూపరులను పూల మొక్కలు ఆకట్టుకుంటున్నాయి. హైదరాబాద్, శ్రీశైలం జాతీయ రహదారి నుంచి గ్రామానికి వెళ్లే నాలుగు కిలోమీటర్ల దూరం, రోడ్డు వెంట మాజీ సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి ప్రోత్సాహంతో మొక్కలు నాటారు. పూలమొక్కలు ఏపుగా పెరిగి పూలు పూస్తూ ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

ఆకట్టుకోవడం సంతోషకరం..

మాజీ సీఎం కేసీఆర్ సూచనలను పాటించాను. అందులో భాగంగా గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపుల మొక్కలతో పాటు పూల మొక్కలను నాటించారు. అవి నేడు పూలు పూచి చూపరులను ఆకట్టుకోవడం సంతోషంగా ఉంది.

- కాసుల రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్, నేదునూరు

దేశ వ్యాప్తంగా ఉద్యాన పంటలకు అధిక డిమాండ్

అసోసియేట్ డీన్ ప్రశాంత్

సమావేశం అనంతరం అసోసియేట్ డీన్ ప్రశాంత్ తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, సెప్టెంబర్ 22: దేశవ్యాప్తంగా ఉద్యాన పంటలకు అధిక డిమాండ్ ఉన్నదని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ ప్రశాంత్ అన్నారు. పూర్వవిద్యార్థుల తొలి సమావేశం ఆదివారం ఘనంగా జరిగింది. రాష్ట్రం ఏర్పాటైన అనతి కాలంలోనే తెలంగాణ వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రాధాన్యత కల్పించారని, దీంతో రాష్ట్ర వ్యాప్తంగా కూరగాయలు, పండ్లు తదితర సాగు పెరిగి, ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ కాలంలో శిక్షణ పొందిన విద్యార్థులకు చాలా భవిష్యత్ ఉన్నదని ఆయన సూచించారు. తెలంగాణలో నేలల స్వరూపం, వాతావరణ పరిస్థితులలో మామిడి నుంచి అరటి, అంజీరా, ద్రాక్ష, డ్రాగన్ ఫ్రూట్ వంటి అధిక పోషకాలు, డిమాండ్ గల పండ్ల తోటలతో పాటు, కూరగాయలు, ఆకుకూరలు, పూలు తదితర పంటల సాగు భారీగా పెరిగిందన్నారు. ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారని, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యక్ష, పరోక్షంగా మంచి డిమాండ్ ఉంటున్నదని తెలిపారు. డీన్ ఆఫ్ స్టూడెంట్స్ డా. విజయ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి సరైన లక్ష్యం నిర్దేశించుకుని.. సరైన సాధనం చేసిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందని తెపారు. రాజేంద్రనగర్, మోజర్ల ఉద్యాన కళాశాలలో 2007-2020 వరకు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రథమ సమ్మేళనం ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యాన వర్సిటీ పరిధిలో ఉన్న కళాశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ లక్ష్మీనారాయణ, డా. పి. సైదయ్య, డా. కళాధర్ బాబు, డా. షహనాజ్, నిరోష, అశ్వినీ కుమార్, సంతోషిని, శ్రీనివాసులు, శ్రీరాములు, శాస్త్రవేత్తలు, బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులున్నారు.

శ్రీ శారద నృత్య నికేతన డ్యాన్స్ అకాడమీ వార్షికోత్సవం సందర్భంగా కూచిపూడి నృత్య ప్రదర్శన రవీంద్రభారతిలో నిర్వహించారు. వక్తలుగా దూరదర్శన్ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.వి.రమణ,ఆర్.గిరిధర్ (ఐపీఎఎస్)లు విచ్చేశారు. కార్యక్రమంలో శ్రీశారద నృత్య నికేతన డైరెక్టర్ శైలజ ప్రసాద్ పాల్గొన్నారు. **- రవీంద్రభారతి**

నవ్యనాటక సమితి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో జరుగుతున్న 49వ అఖిల భారత సంగీత, నృత్య పోటీలలో భాగంగా 4వ రోజు ఆదివారం ప్రత్యేక సంచికను వక్తలు జి. వసుంధర, డాక్టర్ కళాకృష్ణ, కె. సాగరరావు, వాసా గోపీనాథరావు ఆవిష్కరించారు. అనంతరం ప్రముఖ సంగీత, నృత్య గురువులు పాల్గొని యువ ఔత్సాహిక కళాకారులకు పలు అంశాలపై ప్రసంగాలతో వివరించారు.

- తెలుగు యూనివర్సిటీ

నగరంలో డ్రగ్స్ పట్టివేత

ఇద్దరి అరెస్ట్.. మరో ఆరుగురిపై కేసులు నమోదు

రూ.1.62 లక్షల విలువైన 27 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.1.62 లక్షల విలువ చేసే 27 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్టీఎఫ్ ఈఎస్ నంద్యాల అంజిరెడ్డి కథనం ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన సుశీల్‌కుమార్ ఉపాధి కోసం నగరానికి వలసొచ్చి, చిరువ్యాపారం చేస్తూ జీవనం సాగించాడు. అయితే, వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో తిరిగి స్వరాష్ట్రానికి వెళ్లిపోయాడు. అక్కడ బెంగళూరులో డ్రగ్స్ వ్యాపారం చేసే ప్రవీణ్‌సింగ్ రాయ్‌తో పరిచయం ఏర్పడింది. దీంతో సులువుగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్న సుశీల్‌కుమార్.. బెంగళూరు వెళ్లి ప్రవీణ్‌సింగ్ వద్ద ఎండీఎంఏ డ్రగ్‌ను రూ.3,000కు గ్రాము చొప్పున కొనుగోలు చేసి, నగరంలో రెట్టింపు ధరకు విక్రయించసాగాడు. నగరంలో సుశీల్‌కుమార్ వద్ద నుంచి గ్రాముకు రూ.5,000కు చొప్పున రమేశ్, చరణ్ కొనుగోలు చేసి, స్థానికంగా విక్రయిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఆబ్కారీ అధికారులు డ్రగ్స్ విక్రయిస్తున్న సుశీల్‌కుమార్, దీపక్‌ను అరెస్టు చేసి, విచారించగా.. హితేష్, షేక్ మహ్మద్, బాబీకి డ్రగ్స్ విక్రయించినట్లు వెల్లడించారు. మరో ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. పట్టుబడిన నిందితుల వద్ద నుంచి రూ.1.62లక్షల విలువ చేసే 27 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు.

క్యాన్సర్‌కు పూర్తి స్థాయి చికిత్స

నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప


అవగాహన సదస్సులో డాక్టర్ బీరప్ప

ఖైరతాబాద్, సెప్టెంబర్ 22 : క్యాన్సర్‌కు పూర్తి స్థాయి చికిత్స అందుబాటులో ఉన్నదని, భవిష్యత్తులో అన్ని వర్గాలకు చేరుతుందని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప అన్నారు. వరల్డ్ సీఎంఎల్ డే సందర్భంగా నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును ఆంకాలజీ వైద్యనిపుణులు డాక్టర్ సదాశివుడుతో కలిసి ప్రారంభించారు. డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ.. కుటుంబంలో ఒకరికి క్యాన్సర్ వ్యాధి వచ్చిందంటే.. ఆ కుటుంబ సభ్యులందరిపై ప్రభావం పడుతుందన్నారు. ఒక్కోసారి ఖరీదైన మందులు వాడాల్సి వస్తుందని, నిమ్స్ లాంటి దవాఖానలో ప్రభుత్వ ఆరోగ్య పథకాలతో పూర్తిగా ఉచితంగా చికిత్స అందిస్తామన్నారు. మున్ముందు తక్కువ ధరకే మందులు అందరికీ అందుబాటులోకి వస్తాయన్నారు. ఇప్పటికే నిమ్స్‌లో క్యాన్సర్‌పై అనేక పరిశోధనలు జరగాయన్నారు. ఎందరో పేదలకు ఉచితంగా చికిత్స అందించామన్నారు. సీఎంఎల్ వ్యాధి బారిన పడిన వారికి పూర్తిస్థాయి చికిత్స అందుబాటులో ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె. మెహర్ లక్ష్మి, డాక్టర్ సీహెచ్. రచన, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ రఘునాథ రావు తదితరులు పాల్గొన్నారు.

యూరాలజీలో విప్లవాత్మక మార్పులు: గుత్తా శ్రీనివాస్

ల్యాప్ యూరో 2024 అడ్వాన్స్‌డ్ లాపరోస్కోపిక్, రోబోటిక్ యూరాలజీ ప్రొసీజర్ కార్యక్రమంలో హాజరైన పలువురు వైద్య నిపుణులు

మాదాపూర్, సెప్టెంబర్ 22: లాపరోస్కోపిక్, రోబోటిక్ సర్జరీలు యూరాలజీలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని యశోద హాస్పిటల్స్ సీనియర్ యూరాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, డాక్టర్ గుత్తా శ్రీనివాస్ అన్నారు. మాదాపూర్ హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్‌లో ఆదివారం ల్యాప్ యూరో 2024 అడ్వాన్స్‌డ్ లాపరోస్కోపిక్, రోబోటిక్ యూరాలజీ ప్రొసీజర్‌లపై అత్యాధునిక సదస్సును ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్, సీనియర్ యూరాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, డాక్టర్ గుత్తా శ్రీనివాస్, ప్రొఫెసర్, డాక్టర్ అనంత్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుత్తా శ్రీనివాస్ మాట్లాడుతూ.. లాపరోస్కోపిక్, రోబోటిక్ సర్జరీలు యూరాలజీలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ సదస్సులో పీడియాట్రిక్ యూరాలజీ, యూరో ఆంకాలజీ రీ కన్‌స్ట్రక్టివ్ యూరాలజీ, రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో ఆవిష్కరణలపై దృష్టి సారించడం జరుగుతుందన్నారు. రాడికల్ ప్రొస్టేటెక్టమీ నుంచి మూత్రపిండ మార్పిడి వరకు యూరాలజికల్‌లో కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేయడం, కీలకమైన అంశాలపై లోతైన చర్చలు జరిపారు. ఈ సదస్సులో లాపరోస్కోపిక్ సింపుల్ నెఫ్రెక్టమీ, రెట్రో పెరిటోనియోస్కోపిక్ నెఫ్రెక్టమీ, అడ్రినలెక్టమీ, రోబోటిక్ ప్రొస్టేటెక్టమీ వంటి అనేక రకాల ప్రత్యక్ష శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. శస్త్ర చికిత్స విధానాలను మార్చడంలో, వాటిని సురక్షితంగా మరింత ప్రభావవంతంగా చేయడంలో ఆధునిక సాంకేతికత పాత్రను ఆయన గుర్తు చేశారు. రోగులకు మరింత కచ్చితత్వం, మెరుగైన ఫలితాలు, మెరుగైన జీవన నాణ్యతను అందిస్తున్నాయన్నారు. ల్యాప్ యూరో-2024 వంటి సదస్సులతో నైపుణ్యం యొక్క నిరంతర అభివృద్ధికి రోజువారీ ఆచరణలో తాజా సాంకేతికతను చేర్చడానికి ఇలాంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అరవింద్ గన్‌పూలే, డాక్టర్ జమాల్ రిజ్వీ, డాక్టర్ శ్రీహర్ష తదితరులు హాజరయ్యారు.